# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్మ న్యూఢిల్లీలో 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను ఈరోజు ప్రదానం చేశారు.
- దీపావళి, ఛత్ పండుగల సందర్భంగా 12 వేల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.
- రానున్న రెండు రోజుల్లో దేశంలోని పలు రాష్ట్రాలలో భారీ నుండి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28న ప్రసారమవుతుంది.

==========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను ప్రదానం చేశారు. 2023 సంవత్సరానికి గానూ కేంద్రం ఇటీవల ఎంపిక చేసిన ఉత్తమ చిత్రాలు, నటులు, సాంకేతిక నిపుణులు ఈ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా నటుడు మోహన్‌లాల్‌ను సినిమా రంగంలో అత్యున్నత గుర్తింపు అయిన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో రాష్ట్రపతి సత్కరించారు. ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డును హిందీ చిత్రం '12th ఫెయిల్', ఉత్తమ హిందీ ఫీచర్ ఫిల్మ్ అవార్డును 'కథల్: ఎ జాక్‌ఫ్రూట్ మిస్టరీ' చిత్రానికి ప్రదానం చేశారు. ఉత్తమ నటుడి విభాగంలో జవాన్ చిత్రానికి గాను నటుడు షారుఖ్ ఖాన్, 12th ఫెయిల్ చిత్రానికి నటుడు విక్రాంత్ మాస్సేను సత్కరించారు. ఉత్తమ నటి అవార్డును మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే చిత్రంలో నటనకు గాను నటి రాణి ముఖర్జీ స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మ మాట్లాడుతూ...

(వాయిస్ 29 సెకన్లు)

==========================

వస్తు సేవల పన్ను (GST 2.0) సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. GST వసూళ్ళలో గతంలో ఉన్న నాలుగు స్లాబ్ లలో 12, 28 శాతం స్లాబ్ లను పూర్తిగా ఎత్తివేస్తూ... నిన్నటి నుండి కేవలం 5, 18 శాతం స్లాబ్ లను మాత్రమే అమలు చేయడంపై వినియోగదారులతో పాటు, వ్యాపారస్తులు, రైతులు, వివిధ కంపెనీల ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ సంస్కరణల కింద ప్రభుత్వం వివిధ రంగాలలో గణనీయమైన పన్ను తగ్గింపులను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం 1800 సిసి కంటే తక్కువ ఉన్న ట్రాక్టర్లపై గతంలో విధించిన 12 శాతం పన్నును 5 శాతానికి తగ్గించింది. అలాగే ట్రాక్టర్ భాగాలపై జీఎస్టీని 18 శాతం నుండి 5 శాతానికి తగ్గించగా, ఆధునిక వ్యవసాయ పరికరాల ధరను తగ్గించి, చిన్న రైతులకు యాంత్రీకరణను అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా, సామాన్యులకు ఉపశమనం కలిగించడానికి ఎయిర్ కండిషనర్లు, డిష్‌వాషర్లు, టీవీలు వంటి గృహ ఎలక్ట్రానిక్ వస్తువులపై పన్ను రేట్లను కూడా 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించారు. ఈ సంస్కరణలు డిమాండ్ పెంచడంతో పాటు దేశీయ మార్కెట్ పరిమాణం, ఉత్పత్తి సామర్ధ్యాన్ని బలోపేతం చేయడంలో దోహదపడతాయి.

==========================

జాతీయ కవి రాంధారి సింగ్ దినకర్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. దినకర్ కవితలు బీహార్ ప్రజలతో పాటు దేశ వ్యాప్తంగా లోతైన దేశభక్తి భావాలను నింపాయని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. దినకర్ రాసిన అనేక వాక్యాలు ఇప్పటికీ ప్రజా చైతన్యంలో నిలిచిపోయాయని ప్రధానమంత్రి తెలిపారు. శౌర్యం, మానవత్వంతో నిండిన ఆయన శక్తివంతమైన కూర్పులు ప్రతీ తరం భారతమాత సేవకు అంకితమయ్యేలా ప్రేరేపిస్తూనే ఉంటాయని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

==========================

దీపావళి, ఛత్ పండుగల సందర్భంగా ప్రయాణీకుల సౌకార్యార్థం 12 వేల ప్రత్యేక రైళ్లను నడపనున్నామని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈరోజు న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రత్యేక రైళ్లు అక్టోబర్ 1 నుండి నవంబర్ 15వ తేదీ వరకు నడుస్తాయని తెలిపారు. రైల్వేలోని 29 డివిజన్లు రైళ్ల నిర్వహణలో 95 శాతం సమయపాలన సాధించాయని మంత్రి అన్నారు. మొత్తం 70 డివిజన్లలో 100 శాతం సమయపాలన సాధించడానికి రైల్వే మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో... గత 11 సంవత్సరాలుగా భారతదేశం అనేక రంగాలలో విశేష ప్రగతిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయి. ఈ వార్తా విశేషాలను "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలుగా అందిస్తోంది. అందులో భాగంగా వ్యవసాయ రంగంలో సాంకేతికతను ప్రవేశపెడుతూ ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం...

(వాయిస్ 90 సెకన్లు)

==========================

ఆయుష్మాన్ భారత్ - ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన నేటితో 7 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2018, సెప్టెంబర్ లో రాంచీలో ప్రారంభించారు. ఆయుష్మాన్ భారత్ - ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన ప్రపంచంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన అతిపెద్ద ఆరోగ్య బీమా పథకం. ఈ పథకం కింద ఇప్పటివరకు 55

కోట్లకు పైగా లబ్ధిదారులు నమోదు చేసుకోగా, 5 లక్షల రూపాయల వరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచితంగా వైద్య సేవలు లభిస్తాయి.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఆయన బాల్యానికి సంబంధించిన ఇతివృత్తంతో నిర్మించిన “చలో జీతే హై” లఘు చిత్రం దేశవ్యాప్తంగా పలు థియేటర్లలో ప్రదర్శించబడుతుంది. ఈ చిత్రానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పిల్లలు సైతం ఈ చిత్రాన్ని చూసి ప్రేరణ పొందుతున్నారు. ఈనెల 17న ప్రారంభమైన ఈ లఘు చిత్ర ప్రదర్శన రేపటి వరకు కొనసాగుతుంది.

==========================

పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. ఈ ప్రాంతాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. అలాగే ఈశాన్య రాష్ట్రాలు, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, విదర్భలలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

==========================
==========================